కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీకళాశాల కాన్వొకేషన్‌లో మాట్లాడుతున్న కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్



క్రమశిక్షణతో ఉన్నత స్థానాలు అధిరోహించాలి

● కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్

కడప (ఎడ్యుకేషన్), మార్చి13: క్రమశిక్షణ, అంకితభావంతో కష్టపడి చదివితే గ్రాడ్యుయేషన్ స్థాయి చేరుకుంటారని.. అదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితం మీద ఒక నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాత ఉన్నత విద్యను అభ్యసించాలా, ఉద్యోగాల్లో చేరాలా అన్న ఆలోచనపై ఆచితూచి వ్యవహరించాలని సూచించారు. ఉద్యోగాలు చేస్తూ కూడా చదువుకునే అవకాశం ఉందని, దానిపై కూడా దృష్టి సారించవచ్చని తెలిపారు. వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే అన్నది ప్రతి విద్యార్థి జీవితంలో మరుపురాని ఘట్టంలా అభివర్ణించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. విద్యార్థులకు క్యారక్టర్, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమైనవని మంచి పౌరులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలన్నారు. అనంతరం రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా మాట్లాడారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు బంగారు పతకాలు బహూకరించారు. అలాగే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందించారు.

సా...గుతున్నాయి

జగన్ ఎన్నికలకు ముందు.. నేను అధికారంలోకి వస్తే ఐదు లక్షలతో ఇల్లు నిర్మించి తాళం చెవి చేతికి ఇస్తామంటూ చెప్పి గద్దెనెక్కారు. అయితే అధికారంలోకి వచ్చాక బడాయి కోసం పెద్దసంఖ్యలో ఇళ్లు ఇస్తున్నట్లు చెప్పుకుంటూ ఇంటి వ్యయాన్ని మాత్రం రూ.1.80 లక్షలకే పరిమతం చేశారు. అది కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతోనే కడుతున్నారు. నిర్మాణ వ్యయం చాలక నిర్మాణాలు నత్తే నయంగా సా...గుతూనే ఉన్నాయి. వెరసి జిల్లాకు కేటాయించిన ఇళ్లు 1,00,128కు గాను 32,996 మాత్రమే పూర్తయ్యాయి.



కొన్ని ఇళ్లు బేస్‌మట్టానికే పరిమితం

● జగనన్న ఇళ్లు 1,00,128 మంజూరు

● పూర్తయింది 32,996 మాత్రమే

● చాలీచాలని నిర్మాణ వ్యయంతో ఆసక్తి చూపని లబ్ధిదారులు

● నిర్మాణాల పూర్తికి.. రాత్రింబవళ్లు గృహ నిర్మాణ అధికారుల కష్టాలు

● కాలనీల్లో కరెంటు తప్ప రోడ్లు, నీళ్లు కరువు



చెన్నూరు మండలం కనపర్తిలో 25 డిసెంబరు 2020న వైఎస్సార్ జగనన్న కాలనీ నిర్మాణానికి వేసిన శిలాఫలకం

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణం సా..గుతూనే ఉంది. ఆర్భాటం చేసేందుకు.. మా హయాంలో ఇన్ని ఇళ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకునేందుకు వీటిని ప్రారంభించారు తప్ప.. నిజంగా పేదోని సొంతింటి కలను నిజంగా నెరవేర్చాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభించ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పేదలపై నిజంగానే ప్రేమ ఉంటే మార్కెట్‌లో సిమెంటు, ఇనుము, ఇతరత్రా ధరల ఆధారంగా ఇంటి వ్యయం పెంచి ఉండేవారని అంటున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం కేవలం రూ.1.80లక్షలు మాత్రమే ఇస్తుండటంతో.. చాలా మంది లబ్ధిదారులు వెనకంజ వేస్తున్నారు. కొన్నిచోట్ల ఎక్కడో దూరంగా మూడునాలుగు కిలోమీటర్ల దూరంలో కొండలు, గుట్టలు, కుంటల్లో స్థలాలు కేటాయించారు. అంత దూరంలో కేటాయించిన సరైన రోడ్లు వేశారా అంటే అదీ లేదు. కాలనీల్లో రోడ్లు లేవు.. నీళ్లు లేవు.. ఎలా ఇళ్లు కట్టుకోవాలని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు లబ్ధిదారుల మెడపై గృహ నిర్మాణశాఖ అధికారులు కత్తిపెట్టినప్పటికీ.. నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోక, బయట అప్పులు చేయలేకపోవడంతో నిర్మాణాలు ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కి అన్న చందంగా తయారయ్యాయి.


లబ్ధిదారుల అనాసక్తి

జగనన్న ఇళ్ల స్థలాలను ఊరికి దూరంగా ఇచ్చారు. ఇళ్లు కట్టుకుందామంటే అక్కడికి వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. కాలనీల్లో కరెంటు వసతి తప్ప నీళ్లు లేవు. అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉండాలన్నా కూడా సాహసమే. ప్రభుత్వం సూచించిన నమూనా మేరకే ఇల్లు కట్టుకోవాలంటే పెరిగిన ధరల ప్రకారం రూ.5లక్షల నుంచి రూ.8 లక్షలు అవుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం రూ.1.80 లక్షలు కేటాయించి ఇల్లు కట్టుకుని పండుగ చేసుకోమంటోంది. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

చెన్నూరు మండలంలోని కనుపర్తి లేఅవుట్‌లో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని శ్లాబు లెవల్ వరకు వస్తే కొన్ని బిల్డింగులకు శ్లాబులు వేశారు. ఇక్కడ కరెంటు తప్ప రోడ్లు లేవు. శ్లాబు పూర్తయిన కొన్ని ఇళ్లకు వైసీపీ రంగులు వేసి మమ అనిపించారు. అలాగే ఇదే మండలంలో బలసింగాయపల్లె గ్రామం పరిధిలో 2020 డిసెంబరు 25న వైఎస్సార్ జగనన్న కాలనీకి శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఇక్కడ రోడ్లు లేవు. కాంట్రాక్టరు పనులు చేయకుండా వదిలేశాడు. ఈ ఆర్థిక సంవత్సరం మరో 17 రోజుల్లో ముగియ నుంది. కనీసం సగం ఇళ్లు కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఇళ్ల నిర్మాణాలు చూస్తే నత్తే నయం అనిపిస్తుంది. జిల్లాకు 1,00,128 ఇళ్లు మంజూరైతే 97,200 ఇళ్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. 625 ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టనే లేదు. బీబీఎల్ స్థాయిలో 12,888, బేస్‌మట్టం లెవల్‌లో 31,542, రూఫ్ లెవల్‌లో 10,574, ఆర్‌సీ లెవల్‌లో 9,482 ఉండగా ఇంత వరకు 32,092 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. అంటే నాలుగేళ్లలో లక్ష ఇళ్లకు గాను పూర్తయింది కేవలం 32 శాతం మాత్రమే. జగనన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి.. రాత్రింబవళ్లు అధికారులు మాత్రం అష్ట కష్టాలు పడుతున్నారు. పిండికొద్దీ రొట్టె అన్నట్టు.. రొక్కం లేకపోవడంతో అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. లబ్ధిదారులు కూడా అప్పులు చేసి ఇళ్లు కట్టుకోలేక దాటవేత ధోరణిలో ఉండటంతో జగనన్న ఇళ్ల నిర్మాణం సా..గుతూనే ఉంది.



ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోయినా గోడలకు వేసిన వైసీపీ రంగులు



చాలా ఇళ్లకు ఇంకా శ్లాబు పడని దృశ్యం

నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణం

నియోజకవర్గం	కేటాయింపు	రిజిస్ట్రేషన్	మొదలు కానివి	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తి అయినవి
కడప	22,958	22,742	47	3,061	11,774	1,526	970	5,364
కమలాపురం	5,260	5,225	18	642	787	583	370	2,825
పులివెందుల	19,634	18,077	394	2,113	3,177	3,150	2,930	6,313
బద్వేలు	11,395	11,003	96	939	2,199	1,223	1,524	5,022
మైదుకూరు	7,782	7,540	1	370	1,371	783	842	4,173
ప్రొద్దుటూరు	21,373	21,212	60	4,377	9,468	2,206	2,508	2,593
జమ్మలమడుగు	9,678	9,488	7	1,252	2,374	901	277	4,677
సిద్దవటం	1,126	1,084	1	79	241	134	22	607
ఒంటిమిట్ట	922	836	1	55	151	68	39	522
మొత్తం	1,00,128	97,207	625	12,888	31,542	10,574	94,82	32,096

చంద్రబాబును కలిసిన దుర్గాప్రసాద్



చంద్రబాబుకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న దుర్గాప్రసాద్.. చిత్రంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును కడపకు చెందిన దుర్గాప్రసాద్ బుధవారం సాయంత్రం ఉండవల్లిలో కలిశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా దుర్గాప్రసాద్ పోటీ చేశారు. ఆ తరువాత చోటు చేసుకున్న పరిణామాల్లో పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. త్వరలో రాష్ట్రస్థాయి పార్టీలో అవకాశం కల్పిస్తామని టీడీపీ అధికారంలోకి వచ్చాక స్టేట్ కార్పొరేషన్ పదవి ఇస్తామని, కడపలో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డిని గెలిపించాలని చంద్రబాబు తెలిపారని దుర్గా ప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

చంద్రబాబుతో జిల్లా నేతల భేటీ

జిల్లా టీడీపీ నేతలు పలువురు బుధవారం చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. టీడీపీ-బీజేపీ పొత్తు నేపథ్యంలో బద్వేలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు టికెట్లపై చంద్రబాబుతో మాట్లాడారని తెలిసింది. రాత్రి వరకు చర్చలు కొనసాగాయి. చంద్రబాబును కలిసిన వారిలో బద్వేలు నుంచి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి, రోశన్న, జమ్మలమడుగు నుంచి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, ప్రొద్దుటూరు నుంచి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మొల్ల చిత్ర పటానికి పూల మాల వేస్తున్న డిఆర్వో గంగాధర్‌గౌడ్,సభ్యులు



మొల్లమాంబ రామాయణం అజరామరం

● జయంతి వేడుకల్లో డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), మార్చి 13: సరళమైన తేటతెలుగు పద్యాలతో మొల్లమాంబ రాసిన రామాయణం అజరామమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి డాక్టర్ బ్రహ్మయ్య అధ్యక్షతన మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా డీఆర్వోతో పాటు డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్ వెంకటసుబ్బయ్య, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ రామాయణ మహాగ్రంథాన్ని పలువురు వివిధ భాషల్లో రచించారని, అయితే వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణం ఆధారంగా మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగుభాషలో మొల్ల రామాయణాన్ని సరళంగా రచించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకులు డాక్టర్ నాగేంద్రమ్మ, సాహితీ కమిటీ ఉపాధ్యక్షుడు మల్లయ్య, అవధాని జగన్నాథశాస్త్రి, సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, దూదేకుల సంఘం సభ్యులు ఖాదర్‌బాషా, గురుమూర్తి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు నలుగురు ఎంపిక

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమానికి జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా పలమనేరులో 11 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 365 ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొన్నాయి. వీటిలో 24 ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కాగా, వాటిలో నాలుగు కడప జిల్లాకు చెందిన విద్యార్థులవి ఉన్నాయి. కడప నగరం ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థి షేక్ ఆసిఫా, కడప నగరం నాగార్జున మోడల్ స్కూలు 7వతరగతి విద్యార్థి అభిలాష్, 8వతరగతి విద్యార్థి హితేన్ జైన్, కమలాపురం బీసీ వెల్ఫేర్ బాయిస్ పాఠశాల 8వతరగతి విద్యార్థి ఎం.రుగ్వేదవర్మ ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులు రాణించాలని ఆర్జేడీ వై.రాఘవరెడ్డి, డీఈవో అనురాధ, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు.



షేక్ ఆసిఫా



అభిలాష్



హితేన్ జైన్



ఎం.రుగ్వేదవర్మ

10వ తరగతి విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

కడప (మారుతీనగర్), మార్చి 13: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే రోజుల్లో విద్యార్థులకు వారి నివాసం పరీక్ష కేంద్రం వరకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నామని కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల వద్ద పాస్ లేకపోయినా తమ ఒరిజినల్ హాల్ టిక్కెట్‌ను సర్వీస్ కండక్టర్‌కి చూపి అన్ని పల్లెవెలుగు (ఆర్డినరీ), అల్ట్రా పల్లె వెలుగు బస్సులలో రాను, పోను ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ అవ కాశం కేవలం పరీక్ష రాసే రోజులైన 18, 19, 20, 22, 23, 26, 27 తేదీలలో మాత్రమే చెల్లుతుందన్నారు. ఇదిలావుండగా మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

రాజకీయాలకు, డబ్బులకు తల వంచొద్దు : కలెక్టర్

కడప(కలెక్టరేట్), మార్చి 13: తమ హోదాకు వన్నెతెచ్చే విధంగా అధికారుల విధి నిర్వహణ ఉండాలని, రాజకీయాలకు, డబ్బుకు తల వంచకూడదని కలెక్టర్ విజయ రామరాజు హెచ్చరించారు. బుధవారం జేసీ గణేశ్ కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌తో కలసి జిల్లాలోని అన్ని డివిజన్ల ఆర్డీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారి అధికారాలను ప్రజలకు సేవచేయడానికే ఉపయోగించాలన్నారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ ఎంత అవసరమో.. అధికారికి నైతిక ధర్మం అంతే అవసరమన్నారు. గతంలో లాగా అధికారులు అత్యాశ, అక్రమ సంపాదనకు ఆకర్షితులైతే సహించేది లేదని కలెక్టర్ అధికారులను గట్టిగా హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తాం

● ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కడప (రూరల్) మార్చి 13: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, సీహెచ్ పురుషోత్తంనాయుడు పేర్కొన్నారు. బుధవారం జడ్పీ సమావేశ హాలులో ఎన్జీవో సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మనకు రావాల్సిన అన్ని డిమాండ్స్‌ను త్వరగా పరిష్కరిస్తామన్నారు. 12 పీఆర్‌సీలు, పెండింగ్ డీఏలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ పెండింగ్ బిల్లులు, పెన్షనర్స్ సమస్యలు, సరండర్ లీవ్, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం రాష్ట్ర నేతలు, ఆయా జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో భార్య చేతిలో భర్త హతం

ఓబులవారిపల్లె, మార్చి 13: మండలంలోని మంగంపేట ఆర్‌ఆర్-1 సెంటర్ 4వ వీధిలో క్షణికావేశంలో భార్య చేతిలో భర్త మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ చిన్నపెద్దయ్య వివరాల మేరకు... కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని గువ్వలదొడ్డికి చెందిన బోయ తిమ్మప్ప (40) ఇరవై ఏళ్ల క్రితం మంగంపేటకు వచ్చి బేల్దారి పనులు చేసుకుంటూ ఉండేవాడు. స్థానికంగా బోయ నరసమ్మను వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. నరసమ్మ ఏపీఎండీసీలో కాంట్రాక్టు పద్ధతిన స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. ఇంట్లో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుతుండగా, క్షణికావేశానికి గురైన భార్య ఇనుప ఆయుధంతో మోది అనంతరం కత్తితో దాడి చేయడంతో తిమ్మప్పకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్‌సిటీ రైలులో వృద్ధుడు మృతి



ఎర్రగుంట్ల, మార్చి 13: తిరుపతి-హుబ్లీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైల్లో గుర్తు తెలియని వృద్ధుడు మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 55 నుంచి 60 ఏళ్లు ఉండవచ్చునన్నారు. నల్లటి గీతల షర్టు, నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. అలాగే కుడిచేతికి ఆంజనేయస్వామి బొమ్మ పచ్చబొట్టు ఉందన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాల్లేవన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సెల్ నెంబరు 9440627658కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజారెడ్డి

జమ్మలమడుగు, మార్చి 13: జమ్మలమడుగులో మంగళవారం రాత్రి మైలవరం మండలం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నెమలి రాజగోపాల్‌రెడ్డి తాడిపత్రి రోడ్డులో పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. వెంటనే స్థానికులు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దేవగుడి భూపేశ్‌రెడ్డికి జమ్మలమడుగు టీడీపీ టిక్కెట్ ఇవ్వకుండా బీజేపీకి కేటాయిస్తారేమోనని మనస్థాపంతో పురుగుల మందు తాగినట్లు బాధితుడు తెలిపాడు. మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ప్రైవేటు వ్యక్తులతో సబ్‌స్టేషన్లు నిర్వహించొద్దు

ఎస్ఈకి విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకుల వినతి



ఎస్ఈ రమణకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప (నాగరాజుపేట), మార్చి 13: విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోపెట్టి నిర్వహించాలనుకోవడం సరికాదని విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, పీసీ క్రిష్టయ్యలు తెలిపారు. బుధవారం విద్యుత్ భవన్‌లో విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణను కలిసి విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణంలో మూడు డివిజన్‌లలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రైవేటు వ్యక్తులతో నడపాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. వెంటనే ఆ ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యుత్ ఉద్యోగులు పనిచేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చినందువల్ల సంస్థలో పనిచేస్తున్న వయసుపైబడ్డ లైన్‌మెన్లకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. అలాగే ప్రైవేటు వ్యక్తుల నిర్వహణ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. హడావుడిగా ఎటువంటి నియామక ప్రక్రియ చేపట్టకుండా 12 మంది షిఫ్ట్ ఆపరేటర్లను ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఈ విషయమై ఉన్నత న్యాయస్థానంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు పురుషోత్తం, వెంకటచలపతి, మురళి, ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధమైన సీఏఏను అమలు కానివ్వం

రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు



మాట్లాడుతున్న ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి

కడప (నాగరాజుపేట), మార్చి 13 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలు కానివ్వమని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు తెలిపారు. బుధవారం నగరంలోని అజ్మత్ షాదీఖానాలో రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు, ఎన్ఆర్సీ జేఏసీ కన్వీనరు అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన నల్లచట్టాలను ఇప్పటి వరకు కేరళతో సహా ఐదు రాష్ట్రాలు వ్యతిరేకించాయని, ఇదే క్రమంలో మన ప్రభుత్వం కూడా వ్యతిరేకించి తీరాలన్నారు. సీఏఏ చట్టాన్ని రద్దు చేసే వరకు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లెల భాస్కర్, ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్‌బాషా, హిల్స్ ఆఫ్ రాష్ట్ర నాయకులు బాదుల్లా, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, ఎంఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఎంపీడీవో ఫిర్యాదు



హెచ్‌సీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీడీవో

పెండ్లిమర్రి, మార్చి 13: గొందిపల్లె గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖలీల్ తనను బెదిరిస్తున్నాడంటూ ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గొందిపల్లె గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖలీల్ మంగళవారం రాత్రి 9 గంటలకు తన వాట్సాప్ నెంబరుకు అసభ్యపదజాలంతో మెసేజ్‌లు చేశాడన్నారు. నీకు రేపే లాస్ట్ డే అని వార్నింగ్ ఇచ్చాడని అనంతరం ఆ మెసేజ్‌లు డిలీట్ చేశాడన్నారు. మళ్లీ బుధవారం పంచాయతీ కార్యదర్శులతో మోడల్ కోడ్ కాండక్ట్ సమావేశం జరుపుతున్న సమయంలో అతను చాంబర్‌కు కత్తి తీసుకొని వచ్చి బెదిరించబోయాడన్నారు. ఈ మేరకు అతడిపై కేసు ఫైల్ చేయాలని పోలీసులకు ఫిర్యాదు అందించారు.

ఆర్టీపీపీ కొత్త సీఈగా గౌరీపతి

ఎర్రగుంట్ల, మార్చి 13: డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీ చీఫ్ ఇంజనీర్‌గా విద్యుత్ సౌధలో పనిచేస్తున్న గౌరీపతి నియమితులయ్యారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం. ఇక్కడ సీఈగా పనిచేస్తున్న టి.నాగరాజు విజయవాడ వీటీపీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈయన సుమారు సంవత్సర కాలంగా ఇక్కడ సీఈగా విధులు నిర్వహించారు. ఈ మేరకు ఏపీ జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ఆయన బుధవారం సాయంత్రం రిలీవ్ అయినట్లు సమాచారం. అలాగే ఇక్కడికి అప్పటి వరకు ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి ఇన్‌చార్జి సీఈగా పనిచేస్తారని తెలిసింది.

నేటి నుంచి సెమిస్టరు పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13 : కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో గురువారం నుంచి 24వ తేదీ వరకు సెమిస్టరు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు సురేంద్రనాధరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఇంటీరియర్ డిజైన్ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, కల్చర్ విభాగాలకు పరీక్షలు జరుగుతాయన్నారు.

సామాజిక తనిఖీ సర్వే వేగంగా పూర్తి చేయండి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో అనురాధ, సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ సర్వే కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, జడ్పీ, కస్తూర్బా, గురుకుల సంక్షేమ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీతో చర్చించి సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే మాస్టర్ ట్రైనర్స్‌తో అన్ని మండలాల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చామన్నారు. ఎంఈవోలు వారి పరిధిలోని అన్ని మండలాల్లో సర్వే పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని చెప్పారు.

అభివృద్ధి కథ కంచికేనా..?

- బద్వేలు మున్సిపాలిటీలో ఆగిన పనులు
- బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ల వెనకడుగు?
- రూ.130 కోట్ల నిధులలో సగం కూడా ఖర్చు కాని వైనం
- ఎన్నికలు సమీపిస్తున్నాయి.. ఇక పనులు అనుమానమే

బద్వేలు పట్టణం మున్సిపాలిటీగా పురోగతి చెంది 14 సంవత్సరాలైంది. ఇన్నేళ్లయినా మున్సిపాలిటీ అభివృద్ధి మాత్రం నత్తనడకన సాగుతోంది. జిల్లాలో సీఎం సొంత నియోజకవర్గం పులివెందుల తరువాత ఏ మున్సిపాలిటీకి దక్కని అదృష్టం బద్వేలు మున్సిపాలిటీని వరించింది. ఉపఎన్నికలు రావడంతో బద్వేలు మున్సిపాలిటీని రూ.130 కోట్లతో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. ఆ మేరకు అక్కడ ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలిచారు. రెండేళ్లు దాటినా అభివృద్ధి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. రూ.130 కోట్ల నిధులకు గాను కేవలం రూ.47 కోట్లు మాత్రమే వినియోగించి పనులు చేశారని అంటున్నారు. త్వరలో ఎన్నికలు రానుండటంతో ఇక అభివృద్ధి పనుల కథ కంచికే అని పలువురు విమర్శిస్తున్నారు.



బద్వేలు టౌన్, మార్చి 13: బద్వేలు మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులున్నాయి. వీటిలో కొన్నింటిలో మాత్రమే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఎక్కడ చూసినా రోడ్లు, మురుగునీటి కాల్వలు అధ్వాన్నంగా ఉన్నాయి. రూ.130 కోట్ల నిధులు విడుదల చేసినప్పటికీ ఒక్క పేరుతోనే కాంట్రాక్టు వేసి సబ్ కాంట్రాక్టు కింద కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పనులు చేపట్టారు. వీరు అప్పులుతెచ్చి పనులు చేస్తున్నప్పటికీ నెలల తరబడి బిలులు రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో కాంట్రాక్టర్లు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. తమకు బిల్లులు చెల్లించాలని వీరు పట్టుబడుతున్నారని సమాచారం. బిల్లులు మంజూరులో రోజురోజుకూ జాప్యం అవుతుండడంతో అప్పులు తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక కాంట్రాక్టర్లు సతమతమవుతున్నారని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికల గడువు సమీపించి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయం ఆసన్నం కావడంతో అభివృద్ధి పనులు ఇక జరగవని ప్రజలు చర్చించుకుంటున్నారు. నిధులు మంజూరైనా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో పాలకపక్షం విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా అధికార వైసీపీలో ఇసుమంతైనా చలనం కలగడంలేదు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాలేదని, కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో మిగిలిన పనులు పూర్తి చేయలేని స్థితిలో పాలకపక్షం ఉందని సమాచారం.

వైసీపీ నేతల పొలాలకు సిమెంటు రోడ్లు

బద్వేలు మున్సిపాలిటీకి రూ.130 కోట్లు మంజూరు కాగా.. రెండు సంవత్సరాల కిందట రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినా మున్సిపల్ పాలకవర్గం కేవలం రూ.47 కోట్లు మాత్రమే వినియోగించుకోగలిగింది. బద్వేలు మున్సిపల్ పరిధిలోని గుంతపల్లె గ్రామం నుంచి చెన్నంపల్లె వెళ్లే దారిలో సిమంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. ఆ దారి వెంట ఎక్కడ చూసినా నివాస ప్రాంతాలు లేవు. మిద్దెలపాలెం నుంచి రఘునాధపురం వెళ్లే దారిలో వైసీపీ నేతల పొలాలకు సిమెంటు రోడ్లు వేసుకోవడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. అలాగే మార్తోమనగర్ సమీపంలోని జనసంచారం లేని ప్రాంతాల్లో కూడా సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



జనావాసాలు లేని చోట దర్శనమిస్తున్న సీసీ రోడ్లు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువ జనాబా 33వ వార్డు గాండ్లవీధి, రెడ్డయ్యమఠం వీధి, 13వవార్డు శివానగర్, మహబూబ్‌నగర్‌లో ఉంది. ఆ రెండు వార్డుల్లో టీడీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. ఆ రెండు వార్డుల్లోనూ రోడ్ల నిర్మాణాలకు టెండర్లూ పిలవలేదు.. పనులూ చేపట్టలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే కొన్ని వార్డుల్లో సిమెంటు రోడ్లు దెబ్బతిన్నాయి. చాలా వార్డుల్లో మట్టితేలిన రోడ్లు, మురుగు కాల్వలు ప్రత్యేకంగా దర్శనమిస్తున్నప్పటికీ పాలకపక్షానికి, అధికారులకు నిమ్మకునీరెత్తినట్లు కూడా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మహబూబ్‌నగర్‌లో దయనీయ స్థితిలో రహదారి



అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ



సీసీ రోడ్లు వేయాలి..

33వ వార్డులోని గాండ్లవీధి, రెడ్డయ్యమఠం వీధుల్లో జనాబా ఎక్కువ. ఇక్కడ టీడీపీ గెలుపొందడంతో పాలకవర్గం ఈ వీధుల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడం చాలా బాధాకరం. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండడంతో మాకు రోడ్లు వేసేది అనుమానమే.

- ఎం.ప్రసాద్, 33వ వార్డు

అనేకమార్లు విన్నవించినా...

మహబూబ్‌నగర్, శివానగర్‌లలో సిమెంటు రోడ్లు వేయాలని, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని అనేకమార్లు అధికారులకు, పాలకవర్గానికి విన్నవించాం. అయినా ఇంత వరకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయకపోవడం దారుణం.

- నాగార్జున, శివానగర్



ఆలయ నిర్మాణాలు భక్తి భావాన్ని కలిగిస్తాయి



కలెక్టర్లు, ప్రభుత్వ కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం

సంబేపల్లె, మార్చి 13: గ్రామీణ ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలు ప్రజల్లో భక్తిభావాన్ని కలిగిస్తాయని అన్నమయ్య, కడప జిల్లాల కలెక్టర్‌లు అభిషిక్త్‌కిశోర్, విజయరామరాజు, రాష్ట్ర వైద్యసేవల శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ హరిజవహర్‌లాల్, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం పెద్దబిడికిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత నూతన విగ్రహావిష్కరణ, ధ్వజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు ముఖ్య అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం వారు నూతన విగ్రహావిష్కరణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ప్రారంభించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో ముఖ్య అతిథులకు ఆలయ అర్చకులు వేదాశ్వీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామీణాభివృద్ధిలో భాగంగా ఆలయం సమీపంలో ఉన్న చెరువులో ఉపాధి హామీ పథకం ద్వారా పర్కులేషన్ ట్యాంకు, ట్యాంక్ బండ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ డ్వామా పీడీకి ఆదేశాలు జారీ చేశారు. పెద్దబిడికి గ్రామ అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, డ్వామా పీడీ మద్దిలేటి, అన్నమయ్య జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్, సంబేపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నిర్మలాదేవి, గ్రామంలోని ప్రముఖ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో వైవీయూ కాన్వొకేషన్

- *21 వరకు దరఖాస్తుల స్వీకరణ : వీసీ*

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13 : వైవీయూ కాన్వొకేషన్ ఏప్రిల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. కాన్వొకేషన్ నిర్వహణలో భాగంగా రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, ఇంజనీరు రాజశేఖర్‌రెడ్డితో కలిసి యూనివర్శిటీలో వేదిక నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ 11, 12, 13 కాన్వొకేషన్ ఏప్రిల్ నెలలో నిర్వహిస్తున్నామన్నారు. 2023 విద్యాసంవత్సరానికి ముందు ఉత్తీర్ణులైన విద్యార్థులు కాన్వొకేషన్‌లో పట్టాలు పొందేందుకు ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైవీయూ అనుబంధ కళాశాలల్లో 2023కు ముందు పీజీ, డిగ్రీ, బీఈడీ, ఎంఈడీ, ఎంటెక్, లా ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీహెచ్‌డీ అవార్డు అయిన వారు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులందరూ ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తు సమయంలో సందేహ నివృత్తి కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 9705812613ను ఏర్పాటు చేశామన్నారు. 43 మంది మెరిటోరియస్ స్టూడెంట్స్‌కు గోల్డ్‌మెడల్స్ ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పూర్వకుల సచివులు ప్రొఫెసరు డి.విజయరాఘవప్రసాద్, ప్రొఫెసరు వై.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13 : సమాజంలోని అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో సమున్నత స్థానంతో పాటు వారి అభ్యున్నతే లక్ష్యంగా పీఎం సూరజ్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక రుణసాయం అందిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి తెలిపారు. బుధవారం ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రధానమంత్రి సామాజిక్ ఉద్దాన్, రోజ్‌గార్ ఆధారిత్ జనకళ్యాణ్ జాతీయ పోర్టల్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించారు. పలు కేంద్ర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన లక్ష మంది వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తలకు రుణసాయాన్ని పోర్టల్ ద్వారా మంజూరు చేశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య, సరస్వతి మాట్లాడుతూ ఈ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అణగారిన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ వారి ఆర్థిక శ్రేయస్సుకు సామాజిక అభివృద్ధికి తోడ్పాటునివ్వడం ప్రధాని మోదీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ప్రభుత్వాలందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖకు చెందిన అధికారులు,, డీఆర్‌డీఏ అధికారులు, ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనొద్దు : ఐసీడీఎస్ పీడీ

ప్రొద్దుటూరు, మార్చి 13: అంగన్వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, హెల్పర్లు ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా మాత్రమే సేవలు అందించాలి తప్ప పార్టీ ప్రచారాల్లో పాల్గొంటే తీవ్ర ఇబ్బందులు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోంలో అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో పీడీ శ్రీలక్ష్మీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ పౌష్టికాహార కిట్లను అంగన్వాడీ కేంద్రాలలో గానీ వర్కర్స్ ఇళ్లలో గానీ పెట్టుకోకూడదని విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయంటే మిమ్మల్ని ఎవ్వరూ కాపాడలేరని హెచ్చరించారు. కిట్లను వెంటనే లబ్ధిదారులకు పంచిపెట్టాలన్నారు. అంతేకాని అవి కేంద్రాల్లో ఉన్నా, మీ ఇళ్ళలో పెట్టుకున్నా కేసులు పెడతారన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఫేస్ యాప్‌లలో అన్నీ నమోదు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో హాజరు ఏ రోజుకారోజు లేకుంటే మెమోలు జారీ చేస్తామన్నారు. ప్రొద్దుటూరు అర్బన్‌లో వున్న అన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో నడుపుతున్నారని, అవి చాలా ఘోరంగా ఉన్నాయన్నారు. మీరైతే అలాంటి ఇళ్లలో ఉంటారా అని ప్రశ్నించారు. ఇవన్నీ పరిశుభ్రంగా పెట్టుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సొంత ఇళ్లలో పెట్టుకుని అద్దె తీసుకుంటే వారి అద్దె రికవరీతో పాటు వారిపై చర్యలు తప్పవని తెలిపారు. రాజకీయ పార్టీలు ఇచ్చే తాయిలాలు తీసుకుంటే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. సీడీపీవో హైమావతి మాట్లాడుతూ ప్రతి సెంటర్ 2 గంటల తర్వాత మూసేస్తున్నారని 4 గంటల వరకు పెట్టుకొని తీరాలన్నారు. విజిట్‌కు వచ్చినప్పుడు సెంటర్ మూసివుంటే చర్యలు తప్పవన్నారు.

మృత్యుంజయేశ్వరుని ఆలయ హుండీ లెక్కింపు

కడప (మారుతీనగర్), మార్చి 13: నగర మృత్యుంజయ కుంటలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. సంబంధిత దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యనిర్వాహణాధికారులు శ్రీనివాసులు, శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకులు ఎన్.సతీష్ శశిధర్ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 2023 డిసెంబర్ 14 నుంచి ఈనెల 13 వరకు స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఆలయ హుండీలో సమర్పించిన కానుకల రూపంలో రూ. 69,426 ఆదాయం వచ్చినట్లు నిర్ధారించారు. కార్యక్రమంలో అర్చకులు దక్షిణామూర్తి, సాయిశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13 : మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌వో పీఎస్‌వైఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం డీఈవో కార్యాలయంలో డీఈవో అనురాధకు వారు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆర్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు జగన్, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు ఓబులేసు మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రైవేటు ఓపెన్ స్కూళ్లను నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతూ మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే అవకాశం ఉందని.. దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు.

17న బండలాగుడు పోటీలు

సికెదిన్నె, మార్చి 13: మండలంలోని తాడిగొట్ల పంచాయతీ చిన్నపల్లి యోగి నరసింహస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా ఈనెల 17న రాష్ట్రస్థాయి సీనియర్ కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో ప్రథమ బహుమతి రూ.70వేలు, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.15 వేలు, 6వ బహుమతి రూ.10 వేలు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో ఎద్దుల యజమానులు ఆరోజు ఉదయం 7 గంటలకు కమిటీవారి వద్ద టోకన్ తీసుకోవాలని ధర్మకర్త గోసుల మునిరెడ్డి తెలిపారు.

'అయోమయంలో అంగన్వాడీలు'

వేంపల్లె, మార్చి 13: రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలలుగా అంగన్వాడీ సెంటర్లకు సరుకులు సక్రమంగా అందించని కారణంగా అంగన్వాడీలో అయోమయంలో ఉన్నారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న సంపూర్ణ పోషణ ప్రీస్కూల్ పిల్లలకు పాలు, బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లను ప్రభుత్వం ఇవ్వడంలేదన్నారు. సమ్మెకాలంలో ఇస్తామన్న వేతనం తక్షణం ఇవ్వాలని, గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలు, బిల్లులను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు బల్లారపు రామాంజనేయులు, బాలాజీ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 13 : కడప నగరంలో అంగడివీధి, మజీద్ ఫజల్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కడప టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ అమీర్‌బాబు, టీడీపీ నేత అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నగర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మాజీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అష్రఫ్‌అలీఖాన్, సీఎస్ నాసర్ అలీ, రఫీఖాన్, ఇమ్రాన్, ఇలియాస్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 13: జిల్లాలో రిమ్స్ క్యాన్సర్ కేర్, మెంటల్ ఆసుపత్రి, పులివెందుల ఆసుపత్రిలో ఉద్యోగాల నోటిఫికేషన్‌లో అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం చేయవద్దని... పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో అర్హులను కాకుండా అనర్హులను ఉద్యోగాల ఎంపిక చేస్తున్నారన్నారు. కలెక్టరు జోక్యం చేసుకుని అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమం బాబుతోనే సాధ్యం : పుత్తా

పెండ్లిమర్రి, మార్చి 13: రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్న, రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అందాలన్న చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నందిమండలం పంచాయతీలోని తువ్వపల్లె, తిప్పరాజుపల్లెలలో బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధిచేకూరుతుందో వివరించారు. తల్లికి వందనం, దీపం పథకం, ఆడబిడ్డ నిధి, బీసీ చట్టం, రైతు నిధి, నిరుద్యోగ భృతి, ప్రతి ఇంటికి ఉచిత మంచినీరు తదితర పథకాలను వివరించారు. అలాగే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చంద్ర ఓబుళరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చీమలపెంట సర్పంచు ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రామాంజనేయులు, టీడీపీ నాయకులు రాఘునాథరెడ్డి, సారథిరెడ్డి, అరవేటి చంద్రారెడ్డి, అయ్యవారురెడ్డి, చెంగ్రాయుడు, రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అన్నమయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమలాపురం : వైసీపీ వారిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

పుత్తా సమక్షంలో 40 కుటుంబాలు చేరిక

కమలాపురం రూరల్, మార్చి 13: వైసీపీ నిరంకుశ పాలన నచ్చక.. జగన్‌పై నమ్మకం లేక నియోజకవర్గంలో అధిక శాతం వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు వస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం నగర పంచాయతీ పరిధిలో నాలుగో వార్డులో పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో పుత్తా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారందరికీ పుత్తా పార్టీ కండువా వేసి సాదారంగా పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో రాష్ట్రంలో అభివృద్ధిని గాలికి వదలేసిందన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సర కాలంలో రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతమైన అభివృద్ధి చెందిందా అని ఆయన ప్రశ్నించారు. అనంతరం టీడీపీ అధికారంలోకి వచ్చాక పేద ప్రజల కోసం చేపట్టబోయే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

చెన్నూరు, మార్చి 13 : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చెన్నూరు మండలంలోని ఉప్పరపల్లెలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ పార్థసారధి మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని.. విఘాతాలు సృష్టిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉప్పరపల్లె గ్రామంలో గొడవలు సృష్టించడం, కేసులు పెట్టుకోవడం, కోర్టుల చుట్టూ తిరగడం జరిగిందని.. అలాంటి పరిస్థితి రానున్న ఎన్నికల్లో తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు : రాబోవు ఎన్నికల్లో ఎన్నికల సంఘం, పోలీసుల ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని పైడికాల్వ, దిగువపల్లె గ్రామాల్లో ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల్లో గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఘర్షణ వాతావరణం తలెత్తినప్పుడు తమకు తెలిపితే శాంతియుతంగా పరిష్కరిస్తామన్నారు.

సీకే దిన్నె : రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బోడెద్దులపల్లె, జమాల్‌పల్లె, జె.కొత్తపల్లె గ్రామాల్లో బుధవారం సీఐ శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అన్నివిధాలా భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. సీకే దిన్నె పోలీసులు, పారామిలటరీ సిబ్బంది పాల్గొన్నారు.



వల్లూరు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసుల కవాతు

నాగార్జున హైస్కూలులో ఘనంగా ఫేర్‌వెల్ డే



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13: కడప నగరం నాగార్జున ఇంగ్లీషు మీడియం హైస్కూలులో బుధవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి సమాజానికి తోడ్పడాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. ఇంటర్మీడియట్‌లోనే వారి అభివృద్ధికి పునాదులు వేసుకోవాలన్నారు. మంచి స్నేహం పెంపొందించుకోవాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. కార్యక్రమంలో స్కూలు డైరెక్టరు కె.శివ ప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది విద్యార్థినులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

వేంపల్లె, మార్చి 13: తలిశెట్టి బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాయ బోతున్న పదవ తరగతి విద్యార్థినులకు పరీక్ష సామాగ్రి బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణ చేతులమీదుగా వేంపల్లె అక్షర బాలికల జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజయభారతి పంపిణీ చేశారు. త్వరలో జరగనున్న పరీక్షలలో విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎగ్జామ్‌ప్యాడ్, హాల్ టికెట్ కవర్, పెన్నులు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ చందన, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పౌరసత్వ సవరణ బిల్లు రద్దు చేయాలి

చెన్నూరు, మార్చి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న సీఏఏ (పౌరసత్వ బిల్లు)ను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. చెన్నూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే సీఏఏను అమలు చేయనుందన్నారు. ఇలా సీఏఏ అమలు చేసి లబ్ధి పొందాలనుకుంటే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. పౌరసత్వ సవరణ బిల్లు కులమతాల్లో చిచ్చు పెట్టేదిగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి : సీపీఐ

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 13: వేసవి అరంభంలోనే భూగర్భ జలాలు అడుగంటి పోయి తాగు నీటి ఎద్దడి మొదలైందని.. తక్షణం అధికారులు మేల్కొని తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాలక ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకి రాగానే నీటిపారుదల ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసి ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామని ప్రగల్భాలు పలికిందన్నారు. అయితే జిల్లాలో ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని ఇసుక మేటల కోసం దిగువకు వదిలేశారన్నారు. ఈఏడాది వర్షపాతం తగినంత లేకపోవడంతో గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి తలెత్తి ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. సోమశిల బ్యాక్‌వాటర్ తాగునీటి పైపు లైను అర్ధాంతరంగా ఆగిపోయిందన్నారు. పూర్తి చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందన్నారు. కడపకు తాగునీటి పైపులైను అనే మరో కొత్త పథకానికి తెర లేపి దండుకోవాలని చూస్తుందన్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

క్రమం తప్పక మందులు వాడితే టీబీ వ్యాధి నయం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బషీర్ అహమ్మద్

కడప (మారుతీనగర్), మార్చి 13: ఆరు నెలల పాటు క్రమం తప్ప కుండా ప్రభుత్వం ఇచ్చే మందులు వాడితే టీబీ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ బసీర్ అహమ్మద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధి నివారణ వారోత్సవాలలో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో టీబీ కారణంగా ప్రతి రెండు నిమిషాలకు ఇద్దరు చనిపోతు న్నారన్నారు. ప్రధానంగా టీబీ వ్యాధి లక్షణాలు రెండు వారాలకు మించి ఎడతెరపి లేకుండా దగ్గు, సాయంకాలం పూట జ్వరం, దగ్గినపుడు గళ్ళలో రక్తం పడడం, క్రమంగా బరువు తగ్గడం జరుగుతుందన్నారు. ఆకలి కూడా మందగిస్తుందన్నారు.

వ్యాధి గ్రస్తులు దగ్గడం, తుమ్మడం వలన క్రిములు గాలిలో కలిసినపుడు ఆ గాలిని ఆరోగ్యవం తులు పీల్చుకోవడం వలన వ్యాప్తి చెందుతుందన్నారు. ముఖ్యంగా వ్యాధి విస్తరించకుండా వుండడానికి త్వరితగతిన వ్యాధి గ్రస్తులను గుర్తించడం, వారికి గళ్ల పరీక్ష చేయించడం, నిర్ధారణ అయిన వారికి వెంటనే మందులువాడితే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బరాయుడు, వీరేంద్ర బాబు, ధనుంజయ, చాన్ బాష, శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళన అవసరం లేదు

కడప(కలెక్టరేట్), మార్చి 13: టీబి వ్యాధిని అదుపు చేయాలంటే 6 నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని డీపీసీ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని గంగాభవానీ బాలికల ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వమించారు. ఈసందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ టీబి వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్ర దించి మందులు వాడితే వ్యాధిని తగ్గించేందుకు వీలుందని, ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయురాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం : తులసిరెడ్డి



వేంపల్లె, మార్చి 13: విశాఖ ఉక్కు పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్ర దేశ్‌పై కక్షకట్టిందని, అటువంటి పార్టీ ప్రాపకం కోసం రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు టీడీపీ, జనసేన, వైసీపీలు ప్రాకులాడడం శోచనీయమన్నారు. 32 మంది ఆత్మబలిదానాల ఫలితంగా ఏర్పడిందన్నారు. ఈ కర్మాగారం ద్వారా 17000 మంది ప్రత్యక్షంగా, లక్ష మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఆక్సిజన్ పెద్దస్థాయిలో ఉత్పత్తి, సరఫరా చేసి వేలాది మందికి ప్రాణభిక్ష పెట్టిన ప్రాణదాత విశాఖ ఉక్కు అన్నారు. ఏడాదికి మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్వర్గీయ పీవీ నరసింహారావు ఈ కర్మాగారాన్ని జాతికి అంకితం చేశా రన్నారు. 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రెండవ విభాగాన్ని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రారంభించారన్నారు. ఈ కర్మాగారంపై ప్రారంభంలో ఖర్చుపెట్టింది ఎనిమిది వేల కోట్ల రూపాయలు కాగా ప్రస్తుతం ఈ కర్మాగారం ఆస్తుల విలువ దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలన్నారు. అటువంటి జాతిసంపదను కేవలం రూ.30వేల కోట్లకు తనకు అనుకూలు రైన ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అమ్మాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తూ ఉండడం గర్హనీ యమన్నారు. కార్యక్రమంలో ధ్రువకుమార్‌రెడ్డి, రామకృష్ణ, సుబ్రమణ్యం, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి : మాధవీరెడ్డి



బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మాధవీరెడ్డి, హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13: టీడీపీ విజయానికి కృషి చేయాలని కడప నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం 37వ డివిజన్ అగాడి సంఘం ఆఫీసు నుంచి ఎండీహెచ్ మహ్మద్‌బాషా ఆధ్వర్యంలో బాబుషూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవీరెడ్డితో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో ప్రభుత్వం పోవాలని.. అత్యంత అనుభవం గల టీడీపీ అధినేత నారాచంద్రబాబు సీఎం కావాల్సిన అవశ్యకత ఉందన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు : అగాడివీధిలో బుధవారం సాయంత్రం పాలంపల్లె సుబ్బారెడ్డి, యువరాజు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో టీడీపీలోకి స్థానికులు చేరారు. వారికి టీడీపీ కడప నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాధవీరెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు, దుర్మార్గాలను చూసి తట్టుకోలేక ప్రజలు వైసీపీని సాగనంపేందుకు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జాకీర్, డాక్టర్ నజీముద్దీన్, ముక్తియార్, అఫ్సర్‌ఖాన్, గంగిశెట్టి, అబ్దుల్‌ఖాదర్, మాజీ కార్పొరేటరు రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు క్రిసెంట్, జిలానీ, బిట్టు శ్రీధర్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, బాబు, గంగిరెడ్డితో పాటు పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటకానికి నవ్య దిశను నిర్దేశించిన పోలాచలం



పోలాచలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లిఖార్జునరెడ్డి తదితరులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13: చారిత్రక నాటక రచనలతో తెలుగు నాటకానికి ఒక నవ్యదశను నిర్దేశించిన మహానుభావులు పోలాచలం శ్రీనివాసరావు అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ మూల మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో పోలాచలం 171వ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈసందర్భంగా మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర చారిత్రక నాటక పితామహు లుగా ప్రసిద్ధులైన పోలాచలం శ్రీనివాసరావు తెలుగు నేలలో తెలుగు శాశ్వత ప్రదర్శనలను నిర్మించిన రంగస్థల నిర్మాత, నిర్వహకులు అన్నారు. వీరు దాదాపు 30 నాటకాలు రచించారని, ప్రతి నాటకం ప్రజాదరణ పొందిందని.. కొన్ని నాటకాలు ఆయనకు గొప్ప కీర్తి సంపాదించి పెట్టాయని తెలిపారు. ఆయన చారిత్రక నాటకాలు ఆనాటి స్వాతంత్రోద్యమానికి ఎంతో స్ఫూర్తి నిచ్చాయన్నారు. కార్యక్రమంలో గంగయ్య, బాల ఓబయ్య, ఓబులేసు, ప్రసిద్ధ రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

వైసీపీ పథకాలన్నీ... కాంగ్రెస్ పథకాలే

● కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సజాతా రెడ్డి

కడప(కలెక్టరేట్), మార్చి 13: రాష్ట్రంలో వైసీపీ పాలనలో మహిళల ఆరికాభివృద్ధి శూన్యమని, జగన్ ముఖ్యమంత్రి కాక పోతే పథకాలు రావని, ఆగిపోతాయని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇపుడు అమలు జరుగుతున్న పథకాలన్నీ కాంగ్రెస్‌లో ప్రవేశ పెట్టినవే అని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాతారెడ్డి అన్నారు. బుధ వారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఇందిరమ్మ పాలన అన్ని వర్గాలకు ఆమోదమని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయురాలు వైఎస్ షర్మిలారెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్‌ను ఆదరించినట్టే కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వెంకట రమణారెడ్డి, మహిళా నేతలు సంతోషమ్మ, సోనాలి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి బండి ప్రభాకర్



బండి ప్రభాకర్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

(కడప - ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత బండి ప్రభాకర్ టీడీపీ గూటికి చేరారు. బుధ వారం సాయంత్రం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014 నుంచి బీజేపీలో బండి ప్రభాకర్ కొనసాగారు. అప్పటి బీజేపీ అధ్యక్షుడు మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణకు ముఖ్య అనుచరుడుగా ఉంటూ వచ్చారు. కన్నా టీజేపీలో చేరడంతో ఇటీవల ఈయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వచ్చే ఎన్నికల్లో కడపలో టీడీపీ అభ్యర్థులను గెలిపించండి, మీ భవిష్యత్తు నేను చూసుకుంటానని చంద్రబాబు బండి ప్రభాకర్‌కు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు వహించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి

కడప(రూరల్), మార్చి 13: పిల్లల ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని జడ్జి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పిల్లలు ఉంటున్న తరగతి, వసతి గదులను, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించి మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

ప్రమాద నివేదిక అంశంపై అవగాహన అవసరం

వివరణాత్మక ప్రమాద నివేదిక అంశంపై న్యాయశాఖ సిబ్బంది అవగాహనను పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో వివరణాత్మక ప్రమాద నివేదిక అంశంపై న్యాయశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదాలు, వాహనాలు వివరాలు, ప్రాపర్టీ లాస్ మొదలగు అంశాలను వివరించారు.

మొల్లపై జాతీయ సదస్సు నిర్వహిస్తాం : వీసీ

కడప (ఎడ్యుకేషన్), మార్చి 13: మహాకవయిత్రి మొల్లమాంబపై జాతీయ సదస్సును వైవీయూలో త్వరలో నిర్వహిస్తామని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం కవయిత్రి మొల్ల సమావేశ మందిరంలో మొల్ల జయంతి సభ నిర్వహించారు. ముందుగా మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొల్ల రామాయణంపై పరిశోధక విద్యార్థులు పరిశోధనలు చేసేందుకు కూడా అనుమతిస్తామన్నారు. సభాధ్యక్షత వహించిన తెలుగుశాఖాధిపతి ప్రొఫెసరు పార్వతితో పాటు మొల్లసాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావుతోపాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుశాఖ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, ప్రొఫెసరు రమాదేవి, ప్రొఫెసరు వినోదిని పాల్గొన్నారు.

మైదుకూరులో మొదలైన తాగునీటి కష్టాలు



12వ వార్డులో నీటి కోసం తిప్పలు

మైదుకూరు, మార్చి 13 : వేసవి కాలం ప్రారంభంలోనే మైదుకూరులో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పట్టణ శివారు ప్రాంతంలోనున్న ఎర్రచెరువులో నీరు లేక పోవడం తోనే భూగర్భ జలాలు ఇంకిపోవడంతో బోరుబావులు ఎండిపోయాయి. మైదుకూరు పట్టణంలోని 2014లోనే భూగర్భజలాలు ఎండిపోవడంతో పట్టణంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. దీంతో అప్పట్లో పుట్టా సుధాకర్ యాదవ్ అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుక పోయి సమీపంలోని తెలుగు గంగ సబ్సిడరీ రిజర్వాయర్ నుంచి గోడేరు వంక ద్వారా ఎర్రచెరువులో నీళ్ళు నింపేలా శాశ్వత జీవో తీసుక వచ్చారు. అప్పటి నుంచి మైదుకూరు పట్టణంలో నీటి కొరత లేకుండా ఉండేది. అయితే ప్రస్తుతం అధికారులు ప్రజా ప్రతినిధులు ముందుచూపు, సమన్వయలోపంతో ఎర్రచెరువులో నీళ్ళు నింపక పోవడం తో భూగర్భజలాలు ఎండిపోయి మైదుకూరులో పలు వార్డుల్లో నీటి సమస్య తలెత్తింది. రంజాన్ పండుగ కావడంతో ముస్లింల దీక్షలకు తాగు నీరు సమస్యగా మారింది. కాగా నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరును అందిస్తున్నారు. ఇదిలా ఉండగా నీటి సమస్యపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో అధికారులు తెలుగుగంగ సబ్సిడరీ రిజర్వాయర్ నుంచి గోరేడు వంక ద్వారా ఎర్రచెరువుకు నీటిని విడుదల చేశారు.

వైసీపీ ఎమ్మెల్యేలంతా ఓటమికి సిద్ధంగా ఉండండి





ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న సీఎం. సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, మౌనికారెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు, మార్చి 13 : రాష్ట్రంలో జగన్ అరాచక పాలన ముగియనుందని వైసీపీ ఎమ్మెల్యేలంతా ఓటమికి సిద్ధంగా వుండాలని టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొత్తపల్లె పంచాయతీలోని ప్రకాష్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆరుగ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ శెట్టి పల్లె ప్రభాకర్ రెడ్డి, ఈవీ సుధాకర్ రెడ్డి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఖలీల్, అమృతనగర్ నిజాం, ధనిరెడ్డి హరినాధ్‌రెడ్డి, ప్రకాష్ నగర్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: వచ్చే ఎన్నికలలో వైసీపీని ఎవ్వరూ కాపాడలేరని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీమణి మౌనికారెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బాబుల్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిధిలోని నాగాయపల్లె లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాజుపాళెం మండల కన్వీనర్ విశ్వనాధరెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి, ఆవుల దస్తగిరి,తాటి శ్రీను, పెంచల్ రెడ్డి, బాలక్రిష్ణ, గోపాల్‌రెడ్డి, తలారి చంద్ర, వంగలి నడిపెన్న, కొత్తపల్లి కొండయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు పథకాలను ప్రజలకు వివరిస్తూ బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న సతీమణి అరుణమ్మ ప్రచారం నిర్వహించారు. బుధవారం పోరుమామిళ్లలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హబీబున్నీసా, సీతా వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ కల్వకూరి రమణ, శెట్టెం ప్రతాప్, అతికారి రాజా, ధర్వేష్, జిలానీ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కొండాపురం, మార్చి13: మండలంలోని దత్తాపురం జడ్పీహైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని బొమ్మేపల్లె గ్రామానికి చెందిన శ్రీ క్రిష్ణ సేవాసమితి సభ్యులు పదో తరగతి విద్యార్థుల పరీక్షలకు అవసరమయ్యే ప్యాడ్‌లు,పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రేణుకారెడ్డి, శ్రీ క్రిష్ణ సేవాసమితి సభ్యులు ప్రతాప్ యాదవ్,శ్రీనాథ్,వెంకటేశ్ పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో చోరీ

ఖాజీపేట, మార్చి 13: కడప, కర్నూలు జాతీయ రహదారిలోని సాయిబాబా గుడిలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్లితే గుర్తు తెలియని వ్యక్తులు తెల్లవారుజామున సాయిబాబా గుడిలోని ఆంజనేయస్వామి వద్దగల హుండీని పగులకొట్టి అందులోని నదును అపహరించారు. 17 రోజుల క్రితం ఏకంగా పూజారి గుడిలోని అభిషేకం వెండి విగ్రహం, వెండి పళ్లేలు మాయం చేసి అదృశ్యమయ్యాడు. ఒకే నెలలోనే ఇలా జరుగడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో పోలీసులు గస్తీని నిర్వహిస్తే దొంగతనాలు తగ్గుతాయని మరీ వేసవి కాలం కావడంతో ఇంటి ఆరుబయట పడుకోవాలన్నా జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు చేయండి

జమ్మలమడుగు, మార్చి 13: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో దెబ్బతిన్న రోడ్లను మున్సిపాలిటీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలో శ్రీనారాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ప్రభుత్వ పశువుల ఆస్పత్రి వద్ద రోడ్డు దారుణంగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులకు అసౌకర్యంగా ఉందని విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా రోడ్డు సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానం

ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

ప్రొద్దుటూరు, మార్చి 13 : ప్రొద్దుటూరులో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానంగా వుందని, రికార్డులు సక్రమంగా నిర్వహించటం లేదని కేంద్రాలలో పరిశుభ్రత పాటించడం లేదని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు శ్రీలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని బొల్లవరం సెక్టార్‌లోని కాళహస్త్యయ్యవీధి సూపర్‌మార్కెట్ సూపర్‌బజార్‌వీధి మెర్జ్ సెంటర్లను పీడీ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో మెర్జ్ సెంటర్‌లో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని ఆగ్రహించారు. ఈ సెంటర్ల నిర్వాహకులకు మెమోలు జారీ చేయాలని సీడీపీవోను పీడీ ఆదేశించారు. అలాగే శ్రీనివాసనగర్ వాస్తుకాంప్లెక్స్ మెర్జ్ సెంటర్‌ను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రొద్దుటూరులో అంగన్‌వాడీ వర్కర్లు పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు.ఈ తనిఖీల్లో సీడీపీవో హైమావతి పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 13: కొత్తి హైస్కూలు విద్యార్థులను ఇబ్బందిపెడుతున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల విద్యార్థులు బుధవారం డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, కిరణ్, ప్రదీప్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

మైలవరం, మార్చి 13: మండల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలైన కల్లుట్ల, ఎ.కంబాలదిన్నె, నవాబుపేట, వద్దిరాల, చిన్నకొమెర్ల గ్రామాలలో ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, జమ్మలమడుగు రూరల్ సీఐగోపాల్‌రెడ్డి, తలమంచిపట్నం ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ, సీఐ మాట్లాడుతూ ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా కార్యకలాపాలకు పాల్పడకూడదని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కాశినాయన మార్చి 13: వరికుంట్ల సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024-2025 విద్యాసంవత్సరానికి 6,7,8,9,11 తరగతుల్లో సీట్లల్లో ప్రవేశాలకోసం అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.మెర్సీరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించవచ్చునన్నారు.

కొండను తవ్వేస్తున్నారు..

- అడ్డు అదుపు లేకుండా తవ్వకాలు



భారీ యంత్రాలతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, మార్చి 13 : మాకు అడ్డు చెప్పేవాడే లేరు. అంత దమ్మున్న వారు లేరంటూ అనుకున్నారేమో ఆ అధికార పార్టీ నాయకులు. అదే తడవుగా అంతే భారీ యంత్రాలను పెట్టి ఆ కొండను అక్రమంగా తవ్వేస్తున్నారు. రైతులు, ఇతరత్రవారు తవ్వితే పర్మిషన్ లేదంటూ, పట్టుబట్టి జరిమానాలు విధిస్తున్నా అధికారులకు పగలనక, రాత్రనగా జేసీబీలు పెట్టి కొండను తవ్వి మట్టిని తరలిస్తున్నా ఏమాత్రం తమకు కనపడలేదనట్లుగా ఉన్నారు. స్థానిక పోలేరమ్మగుడి వద్ద ఉన్న కొండను ఖాజీపేట మండలానికి చెందిన అధికార పార్టీ నాయకుడు భారీ యంత్రాలను పెట్టి రోడ్డు పనులకు ట్రాక్టర్లు, టిప్పర్లతో అక్రమం గా భారీ యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారు.

తవ్వకాలపై విచారిస్తాం : శ్రీనివాసులు, తహసీల్దారు, బి మఠం

కొండను తవ్వి మట్టిని తరలిస్తున్న విషయం సమాచారం అందింది. కొండ మట్టిని తవ్వేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. దీనిపై స్వయంగా పరిశీలించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

ఆర్థిక అక్షరాస్యతపై వీధి నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

జమ్మలమడుగు, మార్చి 13: జమ్మలమడుగులోని పాత బస్టాండు కేంద్ర సహకార బ్యాంకు ఎదురుగా బుధవారం ఉదయం ఆర్థిక అక్షరాస్యతపై నాబార్డు వారు వీధినాటక పాటలు, మ్యాజిక్ ప్రదర్శించారు. మ్యాజిక్ హ్యాండ్స్ కళాకారుల సంస్థవారు స్థానిక బ్యాంకు మేనేజర్ సి.లక్ష్మి ఆధ్వర్యంలో కళాకారులు నాటక ప్రదర్శన చేశారు. ఆర్థిక అక్షరాస్యతపై పేదల, రైతుల, గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ హ్యాండ్స్ సంస్థ కళాకారులు వై.హరిరామ్, మధు, ప్రవీణ్, ఆకాష్ ఆంజనేయులు, శేషు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

బద్వేలు, మార్చి 13: కబ్జాదారుల నుంచి భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు సాగుచేసుకునేందుకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డు నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు, గోపవరం మండలాలలో ప్రభుత్వ భూములు విస్తారంగా ఉండడంతో విలువైన భూములను కొంతమంది దొంగపట్టాలు,పాస్‌బుక్‌లు చేయించుకుని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కొత్త పల్లి పొలం సర్వే నెంబర్లలో ఇంటిస్థలాలకోసం సి.కొత్తపల్లి, పీపీకుంటలో ఉన్న పేదలకు స్థలాలు ఇచ్చి ప్రభుత్వ స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ, జయరాజు, దుర్గమ్మ, రామసుబ్బమ్మ తదితయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కాశినాయన మార్చి13:రోడ్డుప్రమాదంలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అన్నపురెడ్డి వెంకటరమణను అదేగ్రామానికి చెంది బీసీ నాయకుడు జిల్లా టీడీపీ కార్యదర్శి పోలు మురళీకృష్ణ బుధవారం పరామర్శించారు. ఆమేరకు క్షతగాత్రు యోగక్షేమాలు తెలుసుకొని ఖర్చుల నిమిత్తం రూ.5000 నగదు అందజేశారు.

ఎస్‌బీవీఆర్ కళాశాలలో జాబ్‌మేళా

కడప, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్‌బీవీఆర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. జాబ్‌మేళాకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి 40కి పైగా కంపెనీలు వచ్చాయి. 2వేలమందికి పైగా జాబ్ మేళాలో నిరుద్యోగులు పాల్గొన్నారు. 590 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటసుబ్బారెడ్డి, కళాశాల డీన్ రామలక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ యువనేత కె.రితేష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లానలుమూలల నుంచి నిరుద్యోగులు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

మైదుకూరు, మార్చి 13 : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయానికి గురికాకుండా తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, పోలీసులు అండగా ఉంటారని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. మైదుకూరు పట్టణంలోని మూలబాట వీధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని బుధవారం స్థానిక అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుంచి రాజకీయ నాయకులు ఓట్లకోసం ప్రలోభాలకు గురిచేస్తారని అన్నారు. కొన్ని సందర్భాల్లో బెదిరింపులు ఉంటాయని, ఓటింగ్ రోజు దౌర్జన్యాలుంటాయని తెలిపారు. అలాంటి వాటికి భయపడకుండా పోలీసులకు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా పెట్టడంతో పాటు రక్షణగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశులు, సీఐలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఔట్ సోర్సింగ్ పోస్టులు అమ్ముకుంటున్న ఎమ్మెల్యే

రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై సీఎం సురేశ్‌నాయుడు ఆరోపణలు

ప్రొద్దుటూరు, మార్చి 13 : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ సిబ్బందిని ఇతర ప్రాంతాలకు అక్రమ బదిలీలు చేసి ఆ స్థానంలో ఔట్ సోర్సింగ్ వారి నియామకానికి ఒక్కొక్క పోస్టుకు 15 లక్షలు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వసూలు చేస్తున్నాడని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు ఆరోపించారు. బుధవారం అన్నా క్యాంటీన్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. నిరుద్యోగులు ఆశపడి ఆ పోస్టులకు లక్షలుచెల్లించి మోసపోవద్దన్నారు. దీనిపై ఉద్యోగులే కాకుండా తాము సైతం హైకోర్టులో కేసులు వేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపాలిటీలో ఎమ్మెల్యే అవినీతిని చూసి భరించలేక మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బదిలీపై వెళ్ళి పోయారన్నారు. ప్రొద్దుటూరులో నీటి సమస్యను పరిష్కరించినట్లు ఎమ్మెల్యే అవాస్తవాలు ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. వైసీపీలో అంతర్గతంగా అసమ్మతి పెరిగిందని వాళ్లే ఎమ్మెల్యే రాచమల్లును ఓడించాలనే కసితో వున్నారన్నారు. టీడీపీలో టిక్కెట్టు ఎవ్వరికిచ్చినా కలిసి పోరాడి జెండా ఎగురవేస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మెన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో వున్నప్పుడు ముస్లిం మౌజంలు, ఇమామ్‌లకు ఇళ్లు కట్టివ్వకుండా తీరా ఎన్నికల ముందు వారి ఓటు బ్యాంకు కోసం రాచమల్లు దొంగనాటకాలాడుతున్నాడన్నారు. చౌసెన్‌వలి దర్గాకు కోటి రూపాయలు చందా ఇస్తానని చెప్పి కేవలం 47 లక్షలు ఇచ్చి తిరిగి ఎన్నికలయ్యాక తనను గెలిపిస్తే డబ్బులు ఇస్తాననడం రాచమల్లు అవకాశవాద వైఖరికి నిదర్శనమన్నారు. నిజంగా ముస్లింల మీద అభిమానంవుంటే అమృతనగర్‌లో ముస్లిం విద్యార్థుల హాస్టల్స్‌ను సచివాలయాలుగా వాడుకుంటున్నారెందుకన్నారు. ఉర్దూలైబ్రరీని మూయించి అందులో సచివాలయం పెట్టాడన్నారు.ఉర్దూ డిగ్రీకాలేజీ ఈ ఐదేళ్ళలో ఎందుకు అనుమతులు తెప్పించలేక పోయావో సమాధానం చెప్పాలన్నారు. సెంటర్‌లో కూరగాయల మార్కెట్‌ను కోర్టులో స్టే వున్నా దౌర్జన్యంగా కూలగొట్టి మైనారిటీల మనోభావాలను దెబ్బతీశావన్నారు. తాత్కాలిక మార్కెట్ ఏర్పాటులో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి బండలు షాపు రూములు అమ్ముకున్నావన్నారు. ముస్లింలు ఇప్పటికైనా అతని గురించి పూర్తిగా తెలుసుకుని వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా వున్నారన్నారు. సమావేశంలో టౌన్‌బాంకు డైరెక్టర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కుల, మత రాజకీయాలు చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోగా శివకల్యాణి



మాట్లాడుతున్న బోగా శివకల్యాణి

ప్రొద్దుటూరు, మార్చి 13 : ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కుల మత రాజకీయాలు నడుపుతూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాడని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోగా శివకల్యాణి విమర్శించారు. బుధవారం సరస్వతి విద్యామందిరంలోని బీజేపీ కార్యాలయంలో ఆమె విలే కరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ముస్లిం మైనారిటీలకు మౌజం, ఇమామ్‌లకు ఇళ్లు కట్టించడానికి కోటి రూపాయలు సొంతనిధులు ఇస్తానని ప్రకటించడం ఓటు బ్యాంకు రాజకీయం తప్ప మరొకటి కాదన్నారు. ప్రభుత్వంతో చేయించాల్సిన పనులు సొంత నిధుల పేర చేస్తానని ప్రజలను మభ్యపెట్టడం తగదన్నారు. పులివెందులకు పోయిన మెడికల్ కాలేజీని తిరిగి మూడో సారి గెలిపిస్తే ప్రొద్దుటూరుకు తెప్పిస్తానని ప్రజలను వంచించే రాజకీయాలు రాచమల్లు మానుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ నేతలు శివనాగిరెడ్డి నరసింహప్రకాష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు 10వ తరగతి తొలిమెట్టు

బద్వేలు ,మార్చి 13: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతోనే అద్భుత ఫలితాలు సాధించగలరని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమాకాంత్ పేర్కొన్నారు. బుధవారం చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో 10 వతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మాదన విజయ్‌కుమార్, విద్యాకమిటి చైర్మన్ గోపమ్మ, ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, పెంచలయ్య, సుబ్బారావు, పెంచలయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ తెలుగు ఉపాధ్యాయుడు మాధన విజయ్‌కుమార్ విద్యాసామగ్రిని అందజేశారు.

పోలీసుల అదుపులో అక్రమంగా బర్రెలను తరలించే ముఠా

గోపవరం, మార్చి 13 : మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తులను గోపవరం గ్రామస్థులు బుధవారం పట్టుకున్నారు. ఐదుగురు ముఠాతో పాటు అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులకు అప్పగించారు. కొంత కాలం నుంచి విపరీతంగా పశువులు దొంగలించబడుతున్నాయి. మేత కోసం బయటకు వచ్చిన పశువులను బద్వేలు - నెల్లూరు ప్రధాన రహదారిలో ఉన్న గరుడయ్యసత్రం వెనుక పశువులను బంధించి అక్కడ నుంచి కబేళాలకు తరలిస్తున్నారు. ఈ విషయం గమనిస్తున్న స్థానికులు వారిని పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు

- సచివాలయం, ఆర్బీకేలను ప్రారంభించిన ఎమ్మెల్యే



ఇంకా రంగులు వేయని విద్యుత్, నీటి సౌకర్యం లేని సచివాలయం.... దీనినే ఎమ్మెల్యే ప్రారంభించారు

బ్రహ్మంగారిమఠం, మార్చి13: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందేమోనని వైసీపీలో బెంగపట్టుకుంది. అసంపూర్తిగా ఉన్న భవనాలను సైతం ప్రారంభో త్సవాలు చేస్తూ తమ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇదే తరహాలో బ్రహ్మంగారి మఠం మండలం సోమిరెడి పల్లె సచివాలయం 1, ఆర్బీకేలను బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సచివాలయానికి రూ.43.5 లక్షలు, ఆర్బీకేకి రూ.23.40 లక్షలు నిధులు కేటాయించడంతో దాదాపు రెండేళ్ల క్రితం కాంట్రాక్టరు పనులు చేపట్టారు. సకాలంలో బిల్లులు రాక పోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీ నాయకుల్లో గుబులు పట్టుకుంది. ఇటీవల ప్రజా ప్రతినిధుల వొత్తిడి, బిల్లులు ఇప్పిస్తామంటూ హామీలు ఇవ్వడంతో వాటి కాంట్రాక్టరు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆ భవనాల్లో నీటి సౌకర్యంతో పాటు విద్యుత్, ఫర్నిచరు సమకూర్చలేదు. ఇంకా రంగులు వేయలేదు. రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనే అనుమానంతో ఎమ్మెల్యే బుధవారం వాటిని తూతూ మంత్రంగా ప్రారంభించి వెళ్లిపోయారు.